సాక్షి అనంతపురం

సోమవారం, 8, జూలై, 2024



టమాట కిలో రూ.30

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.30 పలికింది.



ఖాద్రీశుని సేవలో జస్టిస్ మంజుల

హైకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ సి.మంజుల ఆదివారం కుటుంబసమేతంగా కదిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
32.8°/24.5°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

- రూ.7.56 లక్షల సరుకు అమ్మకాల నిలిపివేత

అనంతపురం అగ్రికల్చర్: నగరంలోని ఎరువుల దుకాణాల్లో ఆదివారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. క్వాలిటీ కంట్రోల్ విజిలెన్స్‌లో భాగంగా వ్యవసాయ కమిషనరేట్ నుంచి వచ్చిన ఏడీఏ భాస్కరయ్య, విజిలెన్స్ అధికారి విజయకుమార్ ఆకస్మిక సోదాలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు నిల్వ చేసిన రూ.1.39 లక్షల విలువ చేసే విత్తనాలు, రూ.2.62 లక్షల విలువ చేసే పురుగు మందులు, రూ.3.55 లక్షల విలువ చేసే ఎరువులు మొత్తంగా రూ.7.56 లక్షలు విలువ చేసే సరుకు అమ్మకాలు నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. గడువులోపు సంబంధిత రికార్డులు సమర్పించకపోతే సీజ్ చేసి 6–ఏ కేసు నమోదు చేస్తామని మూడు దుకాణాల యజమానులను హెచ్చరించారు. రైతులకు అందించే ఇన్‌పుట్స్ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలన్నారు. వాటి ధరలకు సంబంధించి బోర్డు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. అన్ని రకాల లైసెన్సులు, ఇన్‌క్లూషన్స్, స్టాక్, సేల్స్ రికార్డులు కచ్చితంగా ఉండాలని సూచించారు. సంతకంతో కూడిన ఒరిజినల్ బిల్లులు రైతులకు ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పరీక్ష నిమిత్తం కొత్త ఉత్పత్తులకు సంబంధించి కొన్ని రకాల నమూనాలు (శ్యాంపిల్స్) సేకరించారు. కార్యక్రమంలో రూరల్ మండల ఏఓ శశికళ, జేడీఏ కార్యాలయ టెక్నికల్ ఏఓలు బాలానాయక్, రాకేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాంకు 50,715 క్యూసెక్కుల వరద



బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం 19,201 క్యూసెక్కులు, శనివారం 25,556 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో ఆదివారం ఉదయానికి 50,715 క్యూసెక్కులకు పెరిగింది. జలాశయంలో 18.249 టీఎంసీల నీరు నిల్వ అయ్యాయి. 1,633 అడుగుల ఎత్తుకు గాను 1,597.31 అడుగులకు నీరు చేరాయి. దీంతో తుంగభద్ర ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ సారి పంటల సాగుకు అవసరమైన సాగునీరు లభిస్తుందని ఆశిస్తున్నారు. మరికొన్ని రోజుల పాటు డ్యాంకు వరద నీరు భారీగా వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే శివమొగ్గ జిల్లాలో తుంగ డ్యాం నుంచి దిగువకు నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే.

కనుల పండువగా కుళ్లాయి స్వామి ప్రథమ దర్శనం



నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారి ప్రథమ దర్శన కార్యక్రమం ఆదివారం రాత్రి కనుల పండువగా సాగింది. కుళ్లాయిస్వామి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. నాయీ బ్రాహ్మణుల సన్నాయి వాయిద్యాల మధ్య, కొబ్బరి దివిటీ వెలుగులో కనిపించిన కుళ్లాయిస్వామిని ప్రథమ దర్శనం చేసుకుని మురిసిపోయారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మారుమోగింది. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

పీఏబీఆర్‌లో పడిపోయిన నీటిమట్టం



పీఏబీఆర్

కూడేరు: మండల పరిధిలోని పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్ డ్యాం)లో నీటి మట్టం పడిపోయింది. ఆదివారం నాటికి డ్యాంలో 0.588 టీఎంసీల నీరు ఉన్నట్లు డ్యాం అధికార వర్గాలు వెల్లడించాయి. జలాశయం వద్ద ఏర్పాటైన శ్రీరామరెడ్డి, సత్యసాయి, అనంతపురం, ఉరవకొండ, కూడేరు తాగునీటి ప్రాజెక్టులకు రోజుకు సుమారు 60 క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేస్తున్నారు.

రైతన్నల గుండెల్లో రాజముద్ర

- వైఎస్సార్ హయాంలో పండుగలా వ్యవసాయం
- వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.13 వేల కోట్ల వ్యయం
- ఉచిత విద్యుత్, రుణమాఫీ, పంటల బీమాతో అన్నదాతలకు బాసట
- తండ్రికి తగ్గ తనయుడిగా రైతులకు వెన్నుదన్నుగా నిలిచిన వైఎస్ జగన్
- రైతుల ఖాతాల్లోకి నేరుగా రూ.8 వేల కోట్లు జమ

ప్రకృతి కన్నెర్ర చేసింది. పాలకుల కరుణ కరువైంది. వరుణుడు పత్తా లేకుండా పోయాడు.వర్షాలు లేక, పంటలు పండక 1993 నుంచి 2004 మధ్య కాలంలో కరువు రక్కసి కబంధ హస్తాల్లో 'అనంత' రైతన్న చిక్కుకున్నారు. అలాంటి తరుణంలో దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశాకిరణంగా కనిపించారు. వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయి అన్నదాత దిక్కులు చూస్తున్న సమయంలో అపర భగీరథుడిగా నిలిచారు. చేతిలో చిల్లిగవ్వ లేక పొట్ట చేతపట్టుకుని ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్న కూలీలు, పేదల ఇంటికి పెద్ద కొడుకయ్యారు. పుట్టెడు అప్పులతో పిల్లల్ని చదివించలేక, ఆత్మాభిమానం చంపుకోలేక అర్ధంతరంగా అసువులు బాసిన రైతుల కుటుంబాలతో పాటు, పేదలకు అండగా నిలిచారు. అన్ని వర్గాలకూ అందరి బంధువయ్యారు. అందుకే ఆయన మరణించి 15 యేళ్లు కావస్తున్నా నేటికీ అందరి మదిలో చెరగని ముద్ర వేసుకున్నారు. నేడు మహానేత వైఎస్సార్ 75వ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.



అనంతపురం అగ్రికల్చర్: 2004లో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన వేదికపై ఉచిత కరెంటు, విద్యుత్ బిల్లుల మాఫీ చేస్తూ తొలి సంతకంతోనే దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి వ్యవసాయానికి ఊపిరి పోశారు. ఆ ఒక్క సంతకంతో ఉమ్మడి జిల్లా రైతులకు చెందిన రూ.70.65 కోట్ల విద్యుత్ బిల్లులు మాఫీ అయ్యాయి. ఐదేళ్లు 1.75 లక్షల వ్యవసాయ మోటార్లకు రూ.వందల కోట్ల విలువ చేసే కరెంటు ఉచితంగా సరఫరా చేశారు. ఖరీఫ్‌లో పంట రుణాల పంపిణీ రూ.6,594 కోట్లకు చేర్చారు. పావలా వడ్డీ కింద రూ.44 కోట్లు ఇచ్చారు.

పంటల బీమాతో ధీమా..

అప్పట్లో చంద్రబాబు హయాంలో అమలవుతున్న పంటల బీమా పథకాన్ని మార్పు చేసి రైతులకు ఎనలేని ధీమా కల్పించారు. 2004-2009 మధ్య వైఎస్ హయాంలో వేరుశనగ రైతులకు పంట కోత ఫలితాల ఆధారంగా బీమా కింద ఏకంగా రూ.1,138 కోట్ల పరిహారం దక్కింది. అలాగే ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.100 కోట్లు అందింది.

ఒకే విడతగా రుణమాఫీ..

2008లో తీవ్ర కరువు పరిస్థితుల నేపథ్యంలో అప్పట్లో కేంద్ర ప్రభుత్వం సహకారంతో వైఎస్సార్ 3,03,937 మంది రైతులకు చెందిన రూ.554.92 కోట్ల రుణాలు ఒకేవిడతలో మాఫీ చేశారు. అప్పటికే బ్యాంకులకు రుణాలు చెల్లించిన రైతులకు ప్రోత్సాహకాల కింద 3,61,269 మందికి రూ.5 వేల చొప్పున రూ.174.04 కోట్లు అందజేశారు. మొత్తమ్మీద రుణమాఫీ, ప్రోత్సాహకాల కింద ఒకే విడతగా 6,65,206 మంది రైతులకు రూ.625 కోట్ల లబ్ధి చేకూర్చారు.

రాయితీతో విత్తనాలు..

ఖరీఫ్, రబీలో రైతులకు లక్షల క్వింటాళ్ల వేరుశనగ, పప్పుశనగ, కంది, ఇతర విత్తనాలు రాయితీతో ఇచ్చారు. 2004- 2009 వరకు ఆరేళ్ల కాలంలో 28,05,901 మంది రైతులకు రూ.280.88 కోట్ల రాయితీతో 26,02,717 క్వింటాళ్ల వేరుశనగ అందజేశారు. కంది, ఆముదం లాంటి ఇతర విత్తనాల కోసం రూ.80 కోట్లు ఖర్చు చేశారు.

అనుబంధ రంగాలకూ ప్రాధాన్యత..

వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పాడి, పశుపోషణ, పట్టు, పండ్లతోటలు, డ్రిప్, స్ప్రింక్లర్ల రైతులకు కూడా చేయూత అందించారు. రూ.25 కోట్ల రాయితీ ఇచ్చి పశుక్రాంతి, జీవక్రాంతి కింద 50 శాతం రాయితీతో మేలుజాతి పశువులు, గేదెలు అందజేసి క్షీర విప్లవానికి నాంది పలికారు. 40 వేల హెక్టార్ల పండ్లతోటల విస్తరణకు రూ.80 కోట్ల సబ్సిడీ అందజేశారు. దీంతో అప్పట్లోనే 'ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఏపీ'గా పేరొచ్చింది. బిందు, తుంపర (డ్రిప్, స్ప్రింక్లర్లు) పరికరాలను ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, ఇతర రైతులకు 90 శాతం రాయితీతో అందజేశారు. సూక్ష్మసేద్యం విస్తరణకు రూ.280 కోట్ల రాయితీ ఇవ్వడంతో 1.13 లక్షల హెక్టార్లకు చేరుకుంది. ఇలా వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి ఏకంగా రూ.13 వేల కోట్ల వరకు ఖర్చు చేశారు.

అంతకు మించి..

తండ్రి వైఎస్సార్‌కు తగ్గ తనయుడిగా గత ఐదేళ్ల కాలంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అంతకు మించి అన్నట్లుగా అన్నదాతకు అడుగడుగునా అండగా నిలిచింది. కరోనా కాలంలో ఉద్యాన ఉత్పత్తుల అమ్మకాలకు ప్రోత్సాహం లాంటివే కాకుండా కేవలం రైతు సంక్షేమానికి ఏకంగా రూ.8 వేల కోట్లకు పైగా వెచ్చించారు. దేశంలో తొలిసారిగా ఊరూరా రైతు భరోసా కేంద్రాల వ్యవస్థతో వ్యవసాయ విప్లవానికి శ్రీకారం చుట్టారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఇతరత్రా ఇన్‌పుట్స్ కోసం గ్రామం దాటి వెళ్లకుండా 867 ఆర్‌బీకేలను నిర్మించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యత పరిశీలనకు ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్‌లతో పాటు పశుసంపద, జీవాల రక్షణకు వెటర్నరీ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. 108 మాదిరిగా 1962 కింద మొబైల్ వెటర్నరీ అంబులెన్సులు తెచ్చారు. రైతు గ్రూపులకు ప్రతి ఆర్‌బీకే పరిధిలో రూ.15 లక్షలు వెచ్చించి కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ) కింద ట్రాక్టర్లు, ఇతర అధునాతన యంత్ర పరికరాలు అందించారు. ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచితంగా పంటల బీమా పథకాన్ని అమలు చేశారు. ఏటా మూడు విడతల్లో రైతు భరోసా–పీఎం కిసాన్ కింద రూ.13,500 పెట్టుబడి సాయం ఇచ్చారు. ప్రతి రైతుకూ న్యాయం జరిగేలా 'ఈ–క్రాప్', ఈ–కేవైసీ పారదర్శకంగా చేపట్టారు. రాయితీతో డ్రిప్, స్ప్రింక్లర్లు అందించారు. ఇలా వ్యవసాయ, అనుబంధ రంగాల పురోభివృద్ధికి అడుగడుగునా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారం అందజేశారు.

కరువు జిల్లాకు జలప్రదాత

అనంతపురం సెంట్రల్: దేశంలో జై సల్మీర్ తర్వాత అత్యంత దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో కరువు నివారించేందుకు వైఎస్సార్ అనేక చర్యలు తీసుకున్నారు. నేడు జిల్లా ప్రజల దాహార్తిని తీర్చడంతో పాటు సాగు అవసరాలను తీరుస్తున్న హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం మహానేత కృషి ఫలితమే.

తాగునీటి ప్రాజెక్టు సాగునీటిగా..

తాగునీటి ప్రాజెక్టుగా ప్రతిపాదనల్లో ఉన్న హంద్రీనీవాను చొరవ తీసుకుని సాగునీటి ప్రాజెక్టుగా వైఎస్సార్ మార్చారు. శ్రీశైలం జలాశయం నుంచి ఎత్తిపోతల ద్వారా చిత్తూరు వరకూ నీటిని తీసుకెళ్లేలా రూపకల్పన చేశారు. 6.02 లక్షల ఎకరాలకు సాగు, 33 లక్షల మందికి తాగునీరు అందించే బృహత్తర ప్రాజెక్టును ఆచరణలో పెట్టారు. సుమారు రూ. 3,185 కోట్లతో పనులు ప్రారంభించారు. శ్రీశైలం జలాశయం నుంచి 40 టీఎంసీలు సాధించాలని లక్ష్యం కాగా ప్రస్తుతం ఏటా 20 టీఎంసీలకు పైగా జలాలు వస్తున్నాయి. 2012 నుంచి కృష్ణాజలాల రాక మొదలైంది. 2020–21లో 39.607 టీఎంసీలు, 2021–22లో 26.458 టీఎంసీలు, 2022–23లో 23.709 టీఎంసీలు, 2023–24లో 21.368 టీఎంసీలు జిల్లాకు వచ్చాయి.

హెచ్చెల్సీ ఆధునికీకరణ..

స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రాలకు తుంగభద్ర జలాశయాన్ని నిర్మించారు. హైలెవల్ మెయిన్ కెనాల్ ద్వారా కర్ణాటకతో పాటు అనంతపురం, వైఎస్సార్ జిల్లాలకు తాగు, సాగునీరు అందిస్తున్నారు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కాలవ ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. దాదాపు రూ. 458 కోట్లు కేటాయించారు. ఆయన హయాంలోనే వివిధ దశల్లో రూ. 308.78 కోట్లు ఖర్చు చేశారు. ఈ క్రమంలోనే మహానేత మరణించడంతో పనులు అటకెక్కాయి. అప్పట్లో రూ. 148.64 కోట్ల పనులు పెండింగ్‌లో ఉండగా, నేడు వాటిని పూర్తి చేయాలంటే ప్రస్తుత ధరల ప్రకారం రూ. 450 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పనులు పూర్తయితే తుంగభద్ర జలాశయం నుంచి 4,200 క్యూసెక్కుల నీటిని తీసుకోవచ్చు. ప్రస్తుతం 2 వేల క్యూసెక్కులకు మించి తీసుకోవడానికి ఆస్కారం లేదు.



హంద్రీనీవా కాలువ

పెన్నానదిపై ఆనకట్టలు..

జిల్లాలో ఒకప్పుడు పెన్నానది పూర్తిగా ఎండిపోయి ఇసుక మేటలు దర్శనమిస్తున్న పరిస్థితి. అలాంటి చోట నీటిని ఒడిసి పట్టేందుకు మహానేత వైఎస్సార్ ప్రాజెక్టులు నిర్మించారు. జలయజ్ఞం పథకంలో భాగంగా పెద్దపప్పూరు మండలంలో రూ. 244 కోట్లతో చాగల్లు, రూ. 110 కోట్లతో పెండేకల్లు రిజర్వాయర్లు పూర్తి చేశారు. రెండు ప్రాజెక్టుల్లో దాదాపు 2 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చు. దీంతో శింగనమల, పెద్దపప్పూరు, తాడిపత్రి ప్రాంతాల్లో తాగు, సాగునీటి సమస్యకు పరిష్కారం దొరికింది.

పీఏబీఆర్‌కు 10 టీఎంసీలు..

పీఏబీఆర్‌కు వైఎస్సార్ 10 టీఎంసీలను కేటాయించారు. కేవలం నీటిని నిల్వ చేసుకోవడానికి మాత్రమే ఉపయోగిస్తున్న రిజర్వాయర్‌కు 2006లో వైఎస్సార్ తుంగభద్ర డ్యాం నుంచి కేసీ కెనాల్ వాటా 10 టీఎంసీలను రివర్స్ డైవర్షన్ పద్ధతిలో కేటాయించారు. అప్పట్లో వైఎస్సార్ చలువతో నేటికీ ఏటా అదనపు జలాలు జిల్లాకు వస్తున్నాయి. ప్రతి సంవత్సరం 4 నుంచి 5 టీఎంసీలు చేరుతున్నాయి. అక్కడితో ఆగకుండా వైఎస్సార్ తాగునీటి పథకం, శ్రీరామరెడ్డి తాగునీటి పథకాలకు శ్రీకారం చుట్టారు. నేడు ఈ పథకాలు దాదాపు జిల్లా అంతటికీ తాగునీటిని సరఫరా చేస్తున్నాయి. పీఏబీఆర్‌కు వచ్చే అదనపు జలాలను తాగునీటి అవసరాలకు వినియోగించుకుంటున్నారు.

ఇష్టారాజ్యంగా ఎలా సర్దుబాటు చేస్తారు?

- బ్రహ్మసముద్రం ఎంఈఓ–2 వ్యవహారంపై కలెక్టర్ సీరియస్

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు కుండా, జిల్లా విద్యాశాఖ అధికారికి చెప్పకుండా మండల విద్యాశాఖ అధికారి ఎలా టీచర్లను సర్దుబాటు చేస్తాడంటూ కలెక్టర్ వినోద్‌కుమార్ మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా బ్రహ్మసముద్రం ఎంఈఓ–2 ఏకంగా 8 మంది టీచర్లను సర్దుబాటు చేయడంపై 'సాక్షి'లో 'అంతా మా ఇష్టం' శీర్షికతో ఆదివారం ప్రచురితమైన కథనం విద్యాశాఖలో కలకలం రేపింది. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించి వెంటనే పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలంటూ డీఈఓ వరలక్ష్మిని ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి టీచర్ల సర్దుబాటు అంశంపై ఇప్పటిదాకా కమిషనర్ నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని, తాముకూడా మండలాలకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని డీఈఓ స్పష్టం చేశారు. ఒకవేళ మరీ విద్యార్థులు ఇబ్బంది పడే పరిస్థితులు ఉంటే జిల్లా అధికారుల దృష్టికి తీసుకొచ్చి వారి అనుమతితో ఎంఈఓ–1 సర్దుబాటు చేయాలి తప్ప, ఎంఈఓ–2 ఎలా చేస్తాడంటూ సీరియస్ అయ్యారు. బ్రహ్మసముద్రం ఎంఈఓ–2 చేపట్టిన టీచర్ల సర్దుబాటు పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేస్తూ కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. ఇదిలాఉండగా బ్రహ్మసముద్రం ఎంఈఓ–1 వ్యక్తిగత సెలవు పెట్టడంతో ఇదే అదనుగా భావించి ఎంఈఓ–2 ఏకంగా 8 మంది టీచర్లను సర్దుబాటు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైగా తనకు ఏమాత్రం సంబంధం లేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కూడా ఓ టీచరును సర్దుబాటు చేయడం వెనుక ఎంఈఓ–2 వ్యక్తిగత ఆసక్తి ఉన్నట్లు తెలిసింది. 'సాక్షి'లో వచ్చిన కథనంతో అప్రమత్తమైన సదరు ఎంఈఓ సోమవారం అందరూ పాతస్థానాల్లోనే చేరాలంటూ చెప్పినట్లు సమాచారం. ఈ వ్యవహారం విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ దృష్టికి కూడా వెళ్లింది. ఆయన ఆదేశాల మేరకు కమిషనర్ కార్యాలయం నుంచి జిల్లా అధికారులను వివరాలు కోరారు. అలాగే ఆర్జేడీ కూడా విచారణకు ఆదేశించారు.

సజావుగా యూపీఎస్సీ పరీక్షలు





ఆర్ట్స్ కళాశాల పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు, పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈపీఎఫ్ఓ పర్సనల్ అసిస్టెంట్, ఈఎస్ఐసీ నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు ఆదివారం పరీక్షలు సజావుగా జరిగాయి. పీఏ పరీక్షకు అభ్యర్థుల హాజరు 26.95 శాతం, ఎన్ఓ పరీక్షకు 81.17 శాతం నమోదయ్యింది. పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వి.వినోద్ కుమార్ సందర్శించారు. కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఉదయం రెండు పరీక్ష కేంద్రాల్లో ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) పర్సనల్ అసిస్టెంట్ పోస్టులకు నిర్వహించిన పరీక్షకు 434 మంది అభ్యర్థులకు గానూ 117 మంది (26.95 శాతం) హాజరయ్యారు. 317 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం ఆరు కేంద్రాల్లో ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు నిర్వహించిన పరీక్షకు 2,109 మంది అభ్యర్థులకు గానూ 1,712 మంది (81.17శాతం) హాజరయ్యారు. 397 మంది గైర్హాజరయ్యారు.

క్లుప్తంగా

రాజకీయ కక్షతో మూడోసారి విధ్వంసం

- వైఎస్సార్‌సీపీ నాయకుడి తుంపర సేద్యం పైపులు పగులగొట్టిన టీడీపీ నేతలు



స్ప్రింక్లర్ పైపులను నరికిన దృశ్యం

పెద్దవడుగూరు: టీడీపీ నేతల ఆగడాలు రోజు రోజుకూ పెచ్చుమీరాయి. రాజకీయ కక్షతో వరుసగా మూడో సారి వైఎస్సార్‌సీపీ నేత డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశారు. వివరాలు... పెద్దవడుగూరు మండలం చింతచెరువు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ సర్పంచ్ మహేశ్వరరెడ్డి బోరు బావి కింద సాగు చేసిన వేరుశనగ పంటకు తుంపర సేద్యం పరికరాలు అమర్చుకున్నాడు. శని వారం రాత్రి టీడీపీ కార్యకర్తలు 34 పైపులు, 10 చిలకలను ధ్వంసం చేశారు. దీంతో దాదాపు రూ.50 వేల మేర నష్టం వాటిల్లింది. గత నెలలో తొలిసారి 46 పైపులు, రెండో సారి 38 పైపులు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి విధ్వంసాన్ని కొనసాగిస్తూ 34 పైపులను ఎక్కడికక్కడ నరికివేశారు. దీంతో ఇప్పటి వరకూ రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు.

ఆంధ్ర మహిళా క్రికెట్ ఆపరేషన్స్ మేనేజర్‌గా 'మచ్చా'



మచ్చా రామలింగా రెడ్డి

అనంతపురం: భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) అనుబంధం ఆంధ్ర మహిళా క్రికెట్ అసోసియేషన్‌కు నూతన ఆపరేషన్ మేనేజర్‌గా అనంతపురానికి చెందిన మచ్చా రామలింగారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఆర్. గోపీనాథరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ మహిళా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, భారత మహిళా క్రికెట్ అసోసియేషన్ డబ్ల్యూసీఐ జాయింట్ సెక్రెటరీగా గతంలో ఆయన పనిచేశారు.

కామాంధుడిపై కేసు నమోదు

కుందుర్పి: మండలంలోని మహంతపురంలో మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన కామాంధుడిపై కేసు నమోదు చేసినట్లు కుందుర్పి ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. రెండు రోజుల క్రితం గ్రామ శివారున బహిర్భూమికి వెళ్లిన మహిళపై అదే గ్రామానికి చెందిన రంగనాథ్ అత్యాచారయత్నం చేశాడన్నారు. ఆ సమయంలో ఆమె గట్టిగా ప్రతిఘటించడంతో రంగనాథ్ పరారయ్యాడన్నారు. ఘటనపై కుటుంబసభ్యులతో కలసి బాధిత మహిళ చేసిన ఫిర్యాదు మేరకు ఆదివారం రంగనాథ్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.



నార్పల మండలానికి చెందిన ఇతని వయస్సు 50 ఏళ్లు. 13 రోజులుగా సూపర్ స్పెషాలిటీలోని నెఫ్రాలజీ ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఇతనికి డయాలసిస్ చేసేందుకు అవసరమైన ప్రతి ఉపకరణాన్ని ప్రైవేట్‌గా కొనుగోలు చేయించారు. ఇందుకు గాను రూ.8వేల నుంచి రూ.10వేల వరకూ ఖర్చు అయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.



సూపర్ స్పెషాలిటీలోని నెఫ్రాలజీ ఐసీయూలో చికిత్స పొందుతున్న ఈ వృద్ధుడు తాడిపత్రి ప్రాంత నివాసి. ఈ నెల ఆస్పత్రిలో చేరాడు. అదే రోజు డయాలిసిస్ చేయాల్సి వచ్చింది. అయితే డయాలసిస్ చేయడానికి అవసరమైన ఉపకరణాలు లేవని ప్రైవేట్‌గా కొనుగోలు చేసుకుని వస్తే చేస్తామని అక్కడి సిబ్బంది తెలిపారు. దీంతో వృద్ధుడి కుటుంబసభ్యులు వాటిని కొనుగోలు చేస్తే రూ.8వేలు అయింది.



కదిరి ప్రాంతానికి చెందిన ఈ వ్యక్తి కిడ్నీ సమస్యతో బాధపడుతూ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరాడు. డయాలసిస్‌కు సంబంధించి మెడకు జుగిటర్ క్యాథటర్ వేసుకోవాల్సి వస్తుందని సిబ్బంది తెలిపారు. ఈ క్యాథటర్ సూపర్ సెష్పాలిటీ ఆస్పత్రిలో అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ స్టోర్స్‌లో రూ.2,500తో కొనుగోలు చేయాల్సి వచ్చింది.

'సూపర్' దయనీయం!

- సూపర్ స్పెషాలిటీలో కిడ్నీ బాధితుల ఆవేదన
- డయాలసిస్ చేయించుకునేందుకు ఉపకరణాలు కొనాల్సిందే
- ఒక్కసారి డయాలసిస్‌కు రూ.వేలలో ఖర్చు
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ



సూపర్ స్పెషాలిటీలోని నెఫ్రాలజీ ఐసీయూ

అనంతపురం మెడికల్: కిడ్నీలో సమస్యతో బాధపడుతూ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి చేరుకుంటే రోగుల జేబులు గుల్ల అవుతున్నాయి. గత ప్రభుత్వంలో ఎన్నో విలువైన సేవలను ఉచితంగా అందించిన ఘనకీర్తి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిది. ఉమ్మడి అనంత జిల్లాకు పెద్దదిక్కుగా ఉన్న ఈ ఆస్పత్రి గురించి తెలుసుకున్న రోగులు ఎంతో ఆశతో వస్తున్నారు. అయితే డయాలసిస్ చేయించుకోవాలంటే ప్రతి ఉపకరణాన్నీ రోగులే కొనుగోలు చేయాల్సి వస్తుండడంతో ఉచిత సేవలు కాస్త ఖరీదుగా మారాయి.

ప్రతి నెలా వందకు పైగా..

ఉమ్మడి జిల్లా ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్న ప్రభుత్వ సర్వజనాస్పత్రి పరిధిలోను ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏడు రకాల దీర్ఘకాలిక రోగులకు స్పెషాలిటీ వైద్య సేవలందుతున్నాయి. ఇందులో నెఫ్రాలజీ విభాగానికి సంబంధించి ఓపీ, ఐపీ సేవలున్నాయి. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వారికి నెఫ్రాలజీ ఐసీయూలో 12 పడకలు ఏర్పాటు చేసి, డయాలసిస్ చేస్తుంటారు. ప్రతి నెలా వందకు పైగా షుగర్ వ్యాధిగ్రస్తులు ఇక్కడకు చికిత్స కోసం వస్తుంటారు. వీరిలో 60 నుంచి 70 మందికి డయాలసిస్ తప్పనిసరిగా చేస్తుంటారు.. అత్యాధునిక యంత్రాలు ఉన్నా... డయాలసిస్ చేయడానికి అవసరమైన జుగిటర్ క్యాథటర్స్ (డయాలసిస్ చేసే సమయంలో మెడ వద్ద వేసే ఉపకరణం), ఇతర పలు రకాల యాసిడ్స్, బైకార్బ్ తదితర ఉపకరణాలు అందుబాటులో లేవు. నెల రోజులుగా ఈ పరిస్థితి నెలకొంది. దీంతో రోగుల కుటుంబసభ్యులే వాటిని ప్రైవేట్‌గా కొనుగోలు చేసి ఇస్తున్నారు. ఒక్కొక్కరికీ డయాలసిస్ చేసినప్పుడల్లా రూ.5వేల నుంచి రూ.8 వేల వరకూ ఖర్చు అవుతోంది. వాస్తవానికి రోగులకు పైసా ఖర్చు కాకుండా ప్రభుత్వ సర్వజనాస్పత్రి అధికారులు సేవలందించాలి. ఇందుకు సంబంధించి నిధులు(హెచ్‌డీఎస్) పుష్కలంగా ఉన్నాయి. కానీ ప్రాణాపాయస్థితిలో ఉన్న రోగులకందించే సేవలకు నిధులు వెచ్చించకుండా అలాగే ఉంచేశారు. వైద్య సేవలు బాగున్నా... ఉపకరణాలు కొనుగోలు చేయలేక రోగులు అవస్థలు పడాల్సి వస్తోంది.

ఏడాది సూపర్ స్పెషాలిటీలో డయాలసిస్ చేసుకున్న రోగుల సంఖ్య	
నెల	రోగుల సంఖ్య
జనవరి	65 మంది
ఫిబ్రవరి	59 మంది
మార్చి	67 మంది
ఏప్రిల్	73 మంది
మే	71 మంది
జూన్	76 మంది

కనిపించని కలెక్టర్ మార్క్..

వాస్తవానికి ఆస్పత్రిలో నెలకొనే సమస్యలను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వెంటనే పరిష్కరించాల్సి ఉంటుంది. అయితే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపించడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ ఒకప్పుడు జిల్లాకు అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రిపై ఓ నిఘా వేసి, వరుస తనిఖీలతో వైద్యులు, ఉన్నతాధికారుల వెన్నులో వణుకు పుట్టించారు. కలెక్టర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించిన తర్వాత సర్వజనాస్పత్రి బాగుపడుతుందని అందరూ ఆశించారు. అయితే తనదైన మార్క్‌ను కలెక్టర్ సైతం చూపలేకపోతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ తీసుకుని ప్రజారోగ్యాన్ని గాడిన పెట్టాలని కోరుతున్నారు.

ఇండెంట్ అందలేదు



సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో డయాలసిస్‌కు సంబంధించిన ఉపకరణాల లోటు అంశాన్ని పరిశీలిస్తాం. సాధ్యమైనంత త్వరగా వాటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. సాధారణంగా అవసరమైన ఉపకరణాలకు సంబంధించి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నుంచి ఇండెంట్ అందాలి. దాని మేరకు నివేదిక సిద్ధం చేసి వెంటనే సమకూరుస్తూ వచ్చాం. అయితే నెల రోజులుగా అక్కడి అధికారుల నుంచి ఎలాంటి ఇండెంట్ అందలేదు. దీనిపై చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్, జీజీహెచ్

సంఘటితంతోనే బ్రాహ్మణుల అభ్యున్నతి



మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

అనంతపురం కల్చరల్: ఐక్యత లేని కారణంగా బ్రాహ్మణులు అన్నింటా వెనుకబడ్డారని, కేవలం సంఘటితంతోనే అభ్యున్నతి సాధ్యమని వక్తలు అన్నారు. అనంతపురంలోని మొదటిరోడ్డు శివాలయం వేదికగా ఆదివారం బ్రాహ్మణ సమ్మేళనం జరిగింది. వేర్వేరుగా ఉన్న అన్ని సంఘాలను సంఘటితం చేసి అఖిలభారత బ్రాహ్మణ ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి అనంత, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి సంఘాల నాయకులు, అర్చక పురోహితులు తరలి వచ్చి తమ సమస్యలను వినిపించారు. ఎస్.శివరాం అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు ఏఎల్ఎస్ శాస్త్రి, సీనియర్ న్యాయవాది హోసూరు రామసుబ్రహ్మణ్యం, విశ్రాంత డీఎస్పీలు గిరికుమార్, లక్ష్మయ్య, బత్తలపల్లి సత్యరంగారావు, బద్రీనాథ్, సంకేపలి సత్యనారాయణ, నార్పల మారుతి తదితరులు మాట్లాడారు. శాఖలుగా, గోత్రాలుగా విడిపోయి ఐక్యత లేక అభివృద్ధికి నోచుకోని బ్రాహ్మణసంఘాలన్నింటినీ ఏకతాటిపైకి తేవడానికి కృషి సాగుతోందన్నారు. ఈ నెల 21న ఆర్ఎఫ్‌రోడ్డు లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రాహ్మణ వధూవర పరిచయ వేదిక ఉంటుందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కష్టాల్లో ఉన్న సాటి బ్రాహ్మణుడికి సాయపడేలా నిత్య చైతన్యం చేయాలని తీర్మానించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, వేదపఠనం జరిగాయి. కార్యక్రమంలో సంఘం నాయకులు, అర్చక సంఘం ప్రతినిధులు దేవరకొండ బాలాజీ శర్మ, అనంత పద్మనాభ శర్మ, రామసుబ్బారావు, శ్రీనివాస్, జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, దేవరకొండ భరద్వాజ్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీలు డీలా

- మొదటి త్రైమాసికంలో గతేడాది కన్నా రూ.65 లక్షల వెనుకబాటు
- రూ.12.43 కోట్లకు గానూ రూ.2.87 కోట్ల పన్ను వసూళ్లు
- పర్యవేక్షణ, నిఘా తగ్గడంతో నిరాశాజనక ఫలితాలు



అనంతపురం అగ్రికల్చర్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఐదేళ్ల హయాంలో కోవిడ్ కబళించిన రెండేళ్లు మినహా మిగిలిన మూడేళ్లు పన్ను వసూళ్లలో లక్ష్యం దిశగా దూసుకెళ్లిన మార్కెట్ కమిటీలు ఈ ఏడాది కాసింత డీలా పడ్డాయి. మొదటి త్రైమాసికంలో జిల్లాలో ఉన్న 9 కమిటీలు కూడా ఈ సారి వెనుకబడి ఉండడం విశేషం. ప్రస్తుత 2024–25 ఆర్థిక సంవత్సరంలో జిల్లా మార్కెటింగ్‌శాఖ 9 మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టుల ద్వారా వివిధ రూపాల్లో రూ.12.43 కోట్ల ఫీజు వసూళ్ల లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అయితే జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి ఏ ఒక్క కమిటీ కూడా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించలేక చతికిలపడ్డాయి. లక్ష్యం అధికంగా ఉన్న అనంతపురం మార్కెట్ కమిటీ మాత్రం వసూళ్ల పరంగా ఆశించిన పురోగతి సాధించినట్లుగా తెలుస్తోంది.

23 శాతం వసూళ్లు..

తొలి మూడు నెలలు ముగిసిన తర్వాత మార్కెట్ కమిటీల వార్షిక లక్ష్యం రూ.12.43 కోట్లకు గానూ 23 శాతంతో రూ.20 లక్షలు తక్కువగా రూ.2.87 కోట్ల వసూళ్లు సాధించాయి. కాగా గతేడాది ఇదే సమయానికి రూ.3.52 కోట్లు వసూలు కావడం విశేషం. తాడిపత్రి, రాయదుర్గం, శింగనమల, ఉరవకొండ, కళ్యాణదుర్గం మార్కెట్ కమిటీల్లో వసూళ్లు గణనీయంగా తగ్గాయి. ఓవరాల్‌గా గతేడాదితో పోల్చుకుంటే అన్ని కమిటీలూ ఫీజు వసూళ్లలో వెనుకంజలో ఉన్నాయి. కాగా ఈ ఏడాది అనంతపురం మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.4.60 కోట్లు కాగా ఇప్పటి వరకూ 35 శాతంతో రూ. 1.60 కోట్లకుపైగా వసూళ్లతో మొదటి స్థానంలో పయనిస్తోంది. రూ.80 లక్షలకు గానూ 29 శాతంతో రూ.26 లక్షల వసూళ్లతో ఉరవకొండ రెండో స్థానంలో కొనసాగుతోంది. ఆ తర్వాత స్థానాల్లో కళ్యాణదుర్గం 22 శాతం, శింగనమల 21 శాతం, తాడిపత్రి 15 శాతంతో ఫరవాలేదన్నట్లుగా ఉన్నాయి. గుంతకల్లు 12 శాతం, రాయదుర్గం 9 శాతం, గుత్తి 8 శాతం, రాప్తాడు 6 శాతం వసూళ్లతో పూర్తీ వెనుకంజలో ఉన్నాయి. ఎన్నికల నేపథ్యంలో మార్కెట్‌యార్డులను ఎవరూ పట్టించుకోకపోవడం వల్ల ఆదాయానికి బాగా గండిపడినట్లు అంచనా వేస్తున్నారు. రాబోవు రోజుల్లో టమాట, మిరప, చింత క్రయ విక్రయాలు, ఇతరత్రా వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల రవాణాకు అవకాశం ఉన్నందున ముందుందు వివిధ రకాల పన్ను వసూళ్లు పెరిగే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం ఆదివారం జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నరసింహులు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయ, ఉద్యోగులకు 12వ పీఆర్సీ అమలు ఆలస్యమైతే వెంటనే మధ్యంతర భృతిని ప్రకటిస్తామని కూటమి అభ్యర్థులు హామీనిచ్చారని గుర్తు చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలన్నీ సత్వరమే పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. పాఠశాలల విలీనాన్ని రద్దుచేసి 1 నుంచి 5వ తరగతి వరకు ప్రాథమిక స్థాయి పాఠశాలలను పునరుద్ధరించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన తెలుగు, హిందీ, ఆంగ్ల భాష పాఠశాల సహాయకుల ప్రమోషన్లను తక్షణమే చేపట్టాలన్నారు. జూన్, జూలై మాసాల్లో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను అప్‌డేట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఇది ఉద్యోగ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులకు తీవ్ర నష్టానికి గురి చేస్తుందన్నారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించేలా చూడాలని కోరారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు రమణ, సర్దార్ వలి, ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.వన్నప్ప, నాయకులు పుల్లయ్య, హిమగిరి ప్రసాద్, రామమూర్తి, గోసుల నారాయణస్వామి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలి

కంబదూరు: మాంసాహారం కన్నా నిత్యమూ చిరుధాన్యాలు భోజనంలో తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్య లభిస్తుందని ప్రఖ్యాత స్వతంత్ర శాస్త్రవేత్త, ఆరోగ్య, ఆహార నిపుణుడు డాక్టర్ ఖాదర్‌వలి అన్నారు. కంబదూరు మండలం గుద్దిళ్లలోని రాధాస్వామి ఆశ్రమంలో రెండో రోజు సాగిన సత్సంగమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ప్రస్తుత జీవన శైలిలో మాంసాహారం వల్ల కలిగే అనర్థాలను, చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో రాధాస్వామి ఆశ్రమ నిర్వాహకులు రామ్‌సింగ్ మహారాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల పరిశ్రమలో విజిలెన్స్ తనిఖీలు



తనిఖీ చేస్తున్న డీఆర్‌సీ భాస్కరయ్య

శింగనమల: మండలంలోని జి.బండమీదపల్లి వద్ద ఉన్న స్వర్ణభూమి ఫర్టిలైజర్ ఎరువుల తయారీ పరిశ్రమలో ఆదివారం ఉదయం తిరుపతి డీఆర్‌సీ భాస్కరయ్య, విజిలెన్స్ అధికారి విజయ్‌కుమార్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఎరువుల తయారీకి సంబంధించిన లైసెన్స్, ఆర్వోలు, మెటీరియల్ వివరాలు, ఎరువుల తయారీ విధానం, విక్రయాలకు చెందిన రికార్డులు, ల్యాబ్‌ను పరిశీలించారు. శ్యాంపిల్స్ సేకరించి పరీక్ష నిమిత్తం తీసుకెళ్లారు. రైతులకు నాణ్యమైన ఎరువులు ఉత్పత్తి చేసి ఇవ్వాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా యాజమాన్యాన్ని హెచ్చరించారు. వారి వెంట మండల వ్యవసాయాధికారి అన్వేష్‌కుమార్, ఏఓ బాలా నాయక్ ఉన్నారు.

ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి



అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) జిల్లా అధ్యక్షుడిగా ఆర్.శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం అనంతపురంలోని నెహ్రూ నగర పాలక పాఠశాలలో ఫెడరేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఫెడరేషన్ జిల్లా తాత్కాలిక అధ్యక్షుడు పోతలయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ... విద్యా వ్యవస్థను కాపాడేలా ప్రభుత్వ చర్యలు ఉండాలన్నారు. 117 జీఓను రద్దు చేయాలన్నారు. తల్లికి వందనం వంటి పథకాలను కేవలం ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలని కోరారు. అనంతరం ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్షుడు రామానాయక్ ఉద్యోగ విరమణతో ఖాళీగా ఉన్న అధ్యక్ష సాధనానికి ఆర్.శ్రీనివాసరెడ్డిని, కార్యదర్శిగా విజయభాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేస్తూ తీర్మానం చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కె.కులశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస నాయక్, ఐఫియా కమిటీ సభ్యులు సత్యప్రసాద్, నాయకులు రవీంద్ర, వెంకటరెడ్డి, ఆంజనేయులు నాయక్, వజీర్ బాషా, రామాంజనేయులు, రమేష్ రెడ్డి, రామాంజనేయులు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు అన్ని విధాలుగా ఎదగాలి

- ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబెల్ అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ



ప్రమాణస్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

తాడిపత్రి అర్బన్: ఆర్యవైశ్యులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబెల్ అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం తాడిపత్రిలోని ఆర్వీ స్వామి కల్యాణమంటపంలో మహాసభ తాడిపత్రి శాఖ, మహిళా విభాగాల ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు క్రమశిక్షణ, ఐక్యతతో ముందుకు సాగాలని కోరారు. నిరుపేద ఆర్యవైశ్యులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వ్యాపార రంగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోకూడదన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆర్యవైశ్యుల కోసం కృషి చేసే వారిని ఏ పార్టీలో ఉన్నా వారి అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. అనంతరం ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ తాడిపత్రి అధ్యక్షుడిగా ఎన్నికైన వంకదారి మద్దిలేటి (రాజా), గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకున్న తలుపుల సురేంద్రనాథ్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎన్నికైన కంబం నాగరత్న, కార్యదర్శి నగరూరు స్వర్ణలత, మరో 35 మంది కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. గ్లోబెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ జ్యోతి ప్రసాద్, ట్రెజరర్ ఎల్వీ కుమార్, సలహాదారు తాడేపల్లి రాజశేఖర్, రాష్ట్ర సౌత్ అధ్యక్షుడు జక్కా సుబ్బరాజు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

జోనల్ టోర్నీ విజేత 'కృష్ణా'




విజేత జట్టుతో భారత మహిళా క్రికెటర్ అనూష

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ –19 మహిళా జోనల్ క్రికెట్ టోర్నీ విజేతగా కృష్ణా జిల్లా జట్టు నిలిచింది. సెంట్రల్, కృష్ణా, నార్త్ జోన్ జట్లు టోర్నీలో పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కృష్ణా జట్టుపై తొలుత బ్యాటింగ్ చేసిన విశాఖ జట్టు 7 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. జట్టులో హితాన్షి 142 బంతుల్లో 71 పరుగులు , వైష్ణవి 53 బంతుల్లో 24 పరుగులు చేశారు. వర్షం రావడంతో డీఎల్ఎస్ విధానంలో 126 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కృష్ణా జట్టు కేవలం 19 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో రంగలక్ష్మి 15 బంతుల్లో 21పరుగులు, జె.మెహక్ 47 బంతుల్లో 53 పరుగులు, గుణచంద్రికారెడ్డి 52 బంతుల్లో 35 పరుగులు సాధించారు. విజేత జట్టు క్రీడాకారులను భారత మహిళా క్రికెటర్ బి.అనూష అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే 'తల్లికి వందనం'

- రాష్ట్రోపాధ్యాయ సంఘం డిమాండ్



సీపీఐ నారాయణ, రామకృష్ణను కలిసిన ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే తల్లికి వందనం పథకం కింద లబ్ధి చేకూర్చినప్పుడే ప్రభుత్వ విద్యారంగం బలోపేతమవుతుందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టేలా చొరవ తీసుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు కోరారు. ఆదివారం అనంతపురంలోని సీపీఐ కార్యాలయంలో వారిని ఎస్టీయూ నాయకులు కలిశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు రాజశేఖర్, ఎ.మల్లికార్జున తదితరులు మాట్లాడుతూ... ప్రధానంగా 117 జీఓ రద్దు, తల్లికి వందనం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అమలయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మీడియం కొనసాగింపు, 12 పీఆర్సీ మేరకు వెంటనే మధ్యంతర భృతిని ప్రకటించేలా, ఉద్యోగులకు సంబంధించిన పీఎఫ్, ఏపీజీఎల్ఐ పెండింగ్ బకాయిలను చెల్లింపు తదితర అంశాలపై ప్రభుత్వంతో చర్చించాలని కోరారు.